RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | మంగళవారం 29 అక్టోబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 169 | పేజీలు: 4 | వెల: రూ.5/-



### టాటా-ఎయిర్‌బస్‌ను
## ప్రారంభించిన ప్రధాని మోదీ

**సెయిన్ ప్రధానితో రోడ్ షో..**
**లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో ద్వైపాక్షిక భేటీ**

2లో..

### వచ్చే ఏడాది నుంచి
# జనాభా లెక్కలు షురూ

**2026లో కొనసాగనున్న ప్రక్రియ.. చివరిసారిగా 2011లో లెక్కలు**



**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (ప్రభాత సూర్యుడు):** దేశంలో జనగణన జరపాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రక్రియ 2025లో ప్రారంభం అవుతుందని సంబంధిత వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఇది 2026 వరకూ కొనసాగనున్నట్లు పేర్కొన్నాయి. ఈ ప్రక్రియ అనంతరం లోక్‌సభ స్థానాల విభజన ప్రక్రియ ఉంటుందని తెలిపాయి. అది 2028కి ముగుస్తుందని వెల్లడించాయి. జనగణన పూర్తి కావడానికి దాదాపు 18 నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హోంశాఖ ఈ ప్రక్రియకు నేతృత్వం వహించనున్నది. 2026లో ప్రభుత్వం గణాంకాలను వెల్లడించే అవకాశం ఉందని సమాచారం. ప్రధానమంత్రి కార్యాలయం తుది అనుమతులు రాగానే జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం కాబోతున్నట్లు ప్రభుత్వ అధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా పేర్కొంటోంది. కాగా, ఇప్పటికే జనాభాలో చైనాను భారత్ దాటిపోయి ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా మారిందని గత ఏడాది ఐక్యరాజ్యసమితి నివేదిక పేర్కొన్న విషయం తెలిసిందే. భారత

..మిగతా 2లో



### రాజ్ పాకాలకు రెండ్రోజుల
## సమయం ఇవ్వండి

**జన్వాడ ఫామ్‌హౌజ్ కేసులో హైకోర్టులో విచారణ**
**విచారణకు హాజరు కాని విజయ్ మద్దూరి**
**తన ఫోన్ బదులు మరొకరి ఫోన్ ఇచ్చిన విజయ్**
**కేటీఆర్ సతీమణిని విచారించిన పోలీసులు**

**హైదరాబాద్, అక్టోబర్ 28 (ప్రభాత సూర్యుడు):** జన్వాడ ఫామ్ హౌస్ కేసుకు సంబంధించి కేటీఆర్ బామ్మర్ది రాజ్‌పాకాల దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. విచారణకు హాజరయ్యేందుకు రాజ్‌పాకాలకు 2 రోజుల సమయం ఇవ్వాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. జన్వాడ ఫామ్ కేసు విచారణలో ఆధారాలు లభిస్తే చర్యలు తీసుకుంటామని పోలీసుల తరఫున ఏఏజీ కోర్టుకు తెలపగా.. నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్లాలని న్యాయస్థానం సూచించింది. కాగా, తెలంగాణలో సంచలనం సృష్టించిన జన్వాడ ఫామ్ హౌస్ రేవ్ పార్టీపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల, విజయ్ మద్దూరిని పోలీసులు ఈ కేసులో ఏ1, ఏ2 నిందితులుగా చేర్చారు. ఈ క్రమంలో జన్వాడ ఫామ్ హౌస్ కేసులో పోలీసులు తనను అక్రమంగా అరెస్ట్ చేయాలని ప్రయత్నిస్తున్నారని.. తనను అరెస్ట్ చేయకుండా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ హైకోర్టులో రాజ్ పాకాల లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. పోలీసుల ముందు హాజరయ్యేందుకు రాజ్ పాకాలకు రెండు రోజుల సమయం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా, జన్వాడ్ ఫామ్ కేసులో కీలక నిందితుడైన రాజ్ పాకాల నివాసం ఓరియన్ విల్లాలో ఆదివారం పోలీసులు సోదాలు చేశారు. అనంతరం పరారీలో ఉన్న రాజ్ పాకాలకు విచారణకు హాజరు కావాలంటూ ఆయన నివాసానికి నోటీసులు అంటించి వెళ్లారు. ఈ క్రమంలోనే రాజ్ పాకాల న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఇదిలావుంటే జన్వాడ ఫామ్ హౌస్ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే ఫామ్ హౌస్‌లో పార్టీకి హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సతీమణిని పోలీసులు విచారించారు. మరోవైపు..

..మిగతా 2లో

## కాళేశ్వరం డిపిఆర్‌కు కేసీఆర్ ఆమోదం

**విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు వెల్లడి**



**హైదరాబాద్, అక్టోబర్ 28 (ప్రభాత సూర్యుడు):** కాళేశ్వరం డీపీఆర్‌ను అప్పటి సీఎం కేసీఆర్ ఆమోదించినట్లు విచారణ సందర్భంగా విశ్రాంత ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. వెంకటేశ్వర్లు కాళేశ్వరం కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించిన అంశాలపై విచారణ సాగింది. ఇందుకు సంబంధించిన దస్త్రాలను కమిషన్‌కు అందించారు. కాళేశ్వరం డిజైన్లనునైల్ చేయమని కేసీఆర్ చెప్పినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు. మినిట్స్‌కు సంబంధించిన దస్త్రాలు, మూడు బ్యారేజీల వివరాలను సమర్పించారు. మేడిగడ్డ కుంగుబాటుకు నిర్వహణ లోపమే కారణమా? మూడు బ్యారేజీల్లో నీరు నింపాలని ఎవరు ఆదేశించారని కమిషన్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. దీనికి అప్పటి ప్రభుత్వాధినేత ఆదేశించారని వెంకటేశ్వర్లు బదులిచ్చినట్లు సమాచారం.



## మంత్రి పొంగులేటికి సిఎం రేవంత్ శుభాకాంక్షలు

**హైదరాబాద్, అక్టోబర్ 28 (ప్రభాత సూర్యుడు):** మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు సీఎం తెలిపారు. అలాగే పలువురు మంత్రులు, తోటి ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు శభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జిల్లాలో పలు కార్యక్రమాలు చేపట్టారు.

## రేవంత్ పాలనలో రోడ్డెక్కనిది ఎవరు?

**11 నెలల పాలనలో అన్నీ మోసలే**
**నిరుద్యోగులకు భృతి లేదు..నియామకాలు లేవు**
**ఫీజు రియంబర్స్‌మెంట్..రైతు భరోసా ఏమ్యింది**
**ప్రభుత్వం విఫలమై ప్రతిపక్షంపై దాడి చేస్తోంది**
**రేవంత్ పాలనపై హరీష్ రావు మండిపాటు**



**హైదరాబాద్, అక్టోబర్ 28 (ప్రభాత సూర్యుడు):** రేవంత్ రెడ్డి నీ పాలనలో.. మోసం చేయనిది ఎవర్ని..? రోడ్డు మీదకు తీసుకురానిది ఎవర్ని..? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. అన్ని కోణాల్లో ఈ ప్రభుత్వం విఫలమై దిక్కుతోచక ప్రతిపక్షంపై దాడులు చేస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రజాపాలన తొలగిపోయి.. కాంగ్రెస్ పార్టీ వికృతరూపం బట్టబయలైందని తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. ఈ రాష్ట్రంలోని విద్యార్థులను, నిరుద్యగులు, ఉద్యోగులను మోసం చేశారని అన్నారు. 2 లక్షల ఉద్యోగాలను ఏడాదిలో భర్తీ చేస్తానని చెప్పారు. నిరుద్యోగులకు 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని మాయమాటలు చెప్పి నట్టేట ముంచారు. ఇక కాంగ్రెస్ ఏడాది

..మిగతా 2లో

## సచివాలయం వద్ద 144 సెక్షన్ అమలు



**హైదరాబాద్, అక్టోబర్ 28 (ప్రభాత సూర్యుడు):** తెలంగాణ సచివాలయపరిధిలో ఆంక్షలు విధించారు. ముట్టడి చర్యలతో అప్రమత్తమైన ప్రభుత్వం ఆంక్షలు విధించింది. సచివాలయ భద్రతా సిబ్బందికి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సచివాలయం చుట్టూ 2 కి.మీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. సిబ్బంది కదలికలు, సోషల్ మీడియాపై నిఘా ఉందన్నారు. పోలీసు అధికారులపై రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వాట్సప్ గ్రూపుల నుంచి ఎగ్జిట్ కావాలని సిబ్బందిని ఆదేశించారు.

## తెలంగాణలో భారీగా ఐఏఎస్‌లు, ఐఎఫ్ఎస్‌ల బదిలీ




**హైదరాబాద్, అక్టోబర్ 28 (ప్రభాత సూర్యుడు):** తెలంగాణలో 13 మంది ఐఏఎస్‌లు, 3 ఐఎఫ్ఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా త్రిపాఠి, రంగారెడ్డి కలెక్టర్‌గా నారాయణ రెడ్డి, యాదాద్రి కలెక్టర్‌గా హనుమంత రావు, మున్సిపల్ శాఖ డైరెక్టర్‌గా టీకే శ్రీదేవి, సీసీఎల్ఏ డైరెక్టర్‌గా మందా మకరందు, ఐ అండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్‌గా ఎస్. హరీష్, నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా దిలీప్ కుమార్, టూరిజం డైరెక్టర్‌గా జెడ్‌కే. హనుమంతు, ఆర్ అండ్ ఆర్, భూసేకరణ కమిషనర్‌గా వినయ్ కృష్ణారెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శిగా ఆయేషా మస్రత్ ఖన్నం, వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్‌గా నిఖిల్ చక్రవర్తి, డెయిరీ కార్పొరేషన్ ఎండీగా

..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# నగరంలో నెలరోజుల పాటు ఆంక్షలు



**హైదరాబాద్, అక్టోబర్ 28 (ప్రభాత సూర్యుడు):** హైదరాబాద్ నగరంలో నెలరోజులపాటు ఆంక్షలు విధిస్తున్నామంటూ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. నగరంలో అశాంతిని సృష్టించడానికి పలు సంస్థలు, పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విశ్వసనీయ సమాచారం ఉండటంతో ఆంక్షలు విధిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నవంబర్ 28 సాయంత్రం ఆరు గంటల వరకు నెల రోజులపాటు నగరంలో సభలు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలపై నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. ఎక్కడైనా ఐదుగురికి మించి గుమికూడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బిఎన్ఎస్ సెక్షన్ 163 (పాత సీఆర్పీసీ 144 సెక్షన్) కింద ఆంక్షలు విధించినట్లు ఆదేశాల్లో వివరించారు. ఇటీవల సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ గుడిపై దాడి ఘటన తర్వాత అల్లర్లు రేగిన సంగతి విదితమే. దీనికి తోడు గ్రూప్-1 విద్యార్థులు, మూసీ నిర్వాసితులు, బెటాలియన్ పోలీసుల వరుస ఆందోళనలతో హైదరాబాద్‌లో పోలీసులకు శాంతిభద్రతల నిర్వహణ సవాలుగా మారింది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈ తాజా ఆంక్షలు విధించినట్లు సమాచారం.

# కాటేపల్లి ఆధ్వర్యంలో ఘనంగా పొంగులేటి జన్మదిన వేడుకలు





### ఎంబిబిఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం
### పొంగులేటి జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ఆర్థికసాయం.
### అయ్యప్పస్వాములకు మహా అన్నదానం

**కల్లూరు -ప్రభాత సూర్యుడు** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు కల్లూరు ప్రధాన సెంటర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆర్యవైశ్య జిల్లా కార్యదర్శి కాంగ్రెస్ నాయకులు కాటేపల్లి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి ,బాణాసంచలు పేల్చి మిఠాయిలు పంచారు. పొంగులేటి జన్మదినం సందర్భంగా క్యాంప్ ఇంచార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి పిలుపుమేరకు సహాయ కార్యక్రమాలు,అయ్యప్పలకు మహాన్నదాన నిర్వహించారు. పొంగులేటి జన్మదినం సందర్భంగా నీట్ లో అత్యధిక మార్కులు సాధించి ,ఎంబిబిఎస్ సీట్లు సాధించిన శాంతినగర్ కు చెందిన తేళ్లపుట్ట ఉదయ్ కిరణ్, కొత్తపల్లి స్వరూప, ఖమ్మంపాటి స్నేహ,నల్లగట్ల సాయి మహతి లను శాలువాతో ఘనంగా సన్మానించి ,వారి వైద్య విద్యకు ఆర్థిక సాయం అందించారు. ఒక్కొక్క విద్యార్థికు పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు.మహా అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి సత్యనారాయణ రెడ్డి నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు భవిష్యత్తులో అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్కినేని రమేష్ యాస వెంకటేశ్వరరావు పోచారం రమేష్ మట్టూరి జనార్ధన్.మాజీ ఎంపీటీసీ సభ్యులు ఎంపీటీసీ కొండూరు కిరణ్, దామాల రాజు ,ఉబ్బెన శ్రీనివాసరావు, మాజీ వార్డ్ మెంబర్ అప్రోచ్ ,కల్లూరుబీసీ సంఘం అధ్యక్షులు బయ్యారపు నరేంద్ర ,నాయకులు మద్దినేని లోకేష్, రాళ్ల బంజర ప్రసాద్,బొడిమల్లే కృష్ణారెడ్డి ,చందు నాయక్,మత్తెబోయిన నాగరాజు, కన్నా కన్నా పాట రవి చెన్నూరు ఉపేంద్ర, బొజ్జయి, అప్రోచ్,ఉబ్బన ఏసు, అషు ,ప్రసాద్ పండు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి పుట్టినరోజు సందర్బంగా
# ఘనంగా నిర్వహించిన కిసర మోహన్ రెడ్డి

**కిసర మోహన్ రెడ్డి నిర్మల రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద కార్యక్రమం**





**కల్లూరు -ప్రభాత సూర్యుడు** మండల పరిధిలో పేరువంచ గ్రామ పంచాయితీలో తెలంగాణా రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి వర్యులు పోగులేటి శ్రీనివాస్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని మంత్రి పొంగులేటి పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ తుంబూరు దయాకరెడ్డి పిలుపు మేరకు పొంగులేటి పుట్టినరోజు వేడుకలలో సేవ కార్యక్రమం లు చెయ్యాలి అని పిలుపు ఇచ్చిన మేరకు పేరువంచ గ్రామ పంచాయితీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కిసర మోహన్ రెడ్డి వారి సతీమణి నిర్మల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదకార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం లో గ్రామ పంచాయితీ లో వెంచేసిన నూతన శ్రీ సీతా రామచంద్ర ఆలయం లో అయ్యప్ప స్వామి మాల ధారణ చేసిన స్వాములకు అన్న ప్రసాదలు వడ్డించడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ కాంగ్రెస్ నాయకులు కిసర మోహన్ రెడ్డి నిర్మల తో పాటుగా,కోర్ల గూడెం సొసైటీ డైరెక్టర్ జోనబోయిన గోపాల్ రావు, యాత్ నాయకులు పరిమి భరత్ స్వామి మరియు కొండపల్లి మురళి, కోట బన్నీ మరియు అయ్యప్ప స్వాములు,పొంగులేటి అభిమానులు, కిసర మోహన్ రెడ్డి అనుచరులు పార్టీ కార్యకర్తలు ఈ అన్న దానా కార్యక్రమం లో పాల్గొన్నారు.

## వచ్చే ఏడాది నుంచి
# జనాభా లెక్కలుషురూ

మొదటి పేజీ తరువాయి...

రాజ్యాంగంలోని ఆర్టికల్-82, ఆర్టికల్-170 ల ప్రకారం దేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనగణన జరగాలి. జనాభా నిష్పత్తి ఆధారంగా లోక్‌సభ, విధానసభ సరిహద్దులను నిర్ణయించాలి. ఆ తర్వాత రిజర్వేషన్లు మారుస్తూ నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించడానికి పునర్విభజన కమిషన్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇది ఒక చట్టబద్ధ సంస్థ. దేశంలో అన్ని ప్రాంతాలకు, కులాలకు సమన్యాయం చేయడం దీని ప్రధాన ఉద్దేశం. కానీ గడచిన 50 ఏండ్లుగా నియోజకవర్గాల విభజన జరగలేదు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ఇక చివరిసారిగా 2011లో జనగణన చేపట్టారు. ఆ తర్వాత 2021లో జరగాల్సి ఉన్నప్పటికీ కొవిడ్ మహమ్మారి కారణంగా వాయిదా పడింది. ఆ తర్వాత మహమ్మారి ప్రభావం తగ్గినప్పటికీ జనగణనపై కేంద్రం దృష్టి సారించలేదు. దీంతో ప్రభుత్వంపై అనేక విమర్శలు వచ్చాయి. జనగణన జరగకపోవడం వల్ల ఆర్థిక డాటా, ద్రవ్యోల్బణం, ఉద్యోగాలకు సంబంధించిన సమాచార నాణ్యతపై ప్రభావం పడుతున్నదని పలువురు ఆర్థికవేత్తలు కూడా పేర్కొన్నారు. ఇప్పటివరకు ఈ లెక్కలన్నీ 2011 జనాభా లెక్కల ఆధారంగా చేస్తూ రావడం వల్ల దేశంలో అసలైన పరిస్థితులు ప్రతిబింబించడం లేదని అభిప్రాయపడ్డారు. దీంతో ఎట్టకేలకు దిగివచ్చిన ప్రభుత్వం కులగణన చేపట్టేందుకు సిద్ధమవుతోంది. దేశంలో ఇప్పటి వరకు 1952, 1963, 1973, 2002లలో నాలుగుసార్లు నియోజక వర్గాల పునర్విభజన జరిగింది. ఇప్పుడు మనకున్న నియోజకవర్గాల సంఖ్యను 1971 జనాభా లెక్కల ఆధారంగా 1973 లో నిర్ణయించడం జరిగింది. దేశంలో జనాభా పెరుగుదల ప్రమాదకరంగా మారిందని భావించి జనాభా నియంత్రణ జరగాలనే ఉద్దేశంతో 1976లో 42వ రాజ్యాంగ సవరణ చేసి ఈ ప్రక్రియను 2001 వరకు నిలిపివేయడం జరిగింది. 2002లో పునర్విభజన జరపాలని ఎన్డీఏ ప్రభుత్వం భావించింది. కానీ దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని దక్షిణానికి చెందిన భాగస్వామ్య పార్టీలు అడ్డుకోవడం జరిగింది. ఫలితంగా 2026 వరకు నిషేధాన్ని పొడిగించారు.

# రాజ్ పాకాలకు రెండ్రోజుల సమయం ఇవ్వండి

మొదటి పేజీ తరువాయి...



ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న విజయ్ మద్దూరి పోలీసుల దర్యాప్తుకు సహకరించ లేదు. ఆదివారం విచారణకు హాజరైన విజయ్ మద్దూరి.. సోమవారం పోలీసుల దర్యాప్తుకు డుమ్మా కొట్టాడు. జన్వాడ ఫామ్ హౌస్‌లో రైడ్ సమయంలో తన మొబైల్ దాచిపెట్టి మరో మహిళ మొబైల్‌ను విజయ్ మద్దూరి తమకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. తన మొబైల్ దొరికితే డ్రగ్స్ లింక్స్ బయటపడతాయన్న భయంతోనే విజయ మద్దూరి వేరే మహిళ ఫోన్ అందజేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దాడుల సమయంలో విజయ్ మద్దూరి సతీమణి ఆయన పక్కనే ఉండగా.. తన సతీమణి నెంబర్ కాకుండా థర్డ్ పర్సన్ నెంబర్‌ను ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. పార్టీలో డబ్బులు కాకుండా కాయిన్స్ రూపంలో పేకాట ఆడినట్లు గుర్తించిన పోలీసులు.. దర్యాప్తులో పేకాట ఆడినట్లు తేలితే మరో కేసు నమోదు చేసే యోచనలో పోలీసులు ఉన్నట్లు తెలుస్తోంది. దాడుల సమయంలో పోలీసుల కంటపడకుండా కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాలా పరార్ అయ్యాడని పోలీసులు తెలిపారు. ఈ కేసులో రాజ్ పాకాలా, విజయ మద్దూరి నోరు మెదిపితే కేసు దర్యాప్తు ముందుకు సాగుతోందంటున్నారు.

## టాటా-ఎయిర్‌బస్‌ను
# ప్రారంభించిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (ప్రభాత సూర్యుడు):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ ఇద్దరూ కలిసి సోమవారం గుజరాత్‌లోని వడోదరలో టాటా-ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముందు ఇద్దరూ కలిసి రోడ్ షో నిర్వహించారు. సోమవారం ఇరు దేశాధి నేతలు చారిత్రాత్మకమైన లక్ష్మీ విలాస్ ప్యాలెస్‌లో ద్వైపాక్షిక భేటీలో పాల్గొననున్నారు. కాగా టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు చెందిన ఈ ఫెసిలిటీని సైనిక విమానాల తయారీ కోసం ఉపయోగిస్తారు. మన దేశంలో మొట్టమొదటి ప్రైవేటురంగ ఫైనల్ అసెంబ్లీ లైన్ ఇదే కావడం గమనార్హం. ఒప్పందంలో భాగంగా ఈ ఫెసిలిటీలో మొత్తం 40 విమానాలను తయారు చేస్తారు. ఏవియేషన్ దిగ్గజ కంపెనీ 'ఎయిర్‌బస్' నేరుగా 16 విమానాలను భారత్‌కు అందించనుంది. టాటా-ఎయిర్‌బస్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫెసిలిటీ ప్రారంభంపై కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. సైనిక విమానాల తయారీ కోసం భారతదేశంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి ప్రైవేట్ రంగ ప్లాంట్ ఇదేనని తెలిపింది. "టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ భారత్‌లో 40 విమానాలను తయారు చేసే బాధ్యతలు తీసుకుంటుంది. ఈ ఫెసిలిటీ దేశంలోనే తొలి ప్రైవేట్ సెక్టార్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌గా నిలిచింది. తయారీ నుంచి అమరిక వరకు సమస్త వ్యవస్థ ఇక్కడే ఉంటుంది. విమానాలను టెస్టింగ్ చేయడం నుంచి డెలివరీకి అవసరమైన అర్హత ప్రమాణాలను కూడా ఇక్కడే నిర్వహిస్తారని పేర్కొంది. కాగా టాటా కంపెనీలతోపాటు భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వంటి ప్రముఖ ప్రభుత్వ కంపెనీలతో పాటు ప్రైవేట్ రంగానికి చెందిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కంపెనీలు కూడా తమ సహకారాన్ని అందించనున్నాయి. కాగా వడోదరలో ఏర్పాటు చేసిన ఫైనల్ అసెంబ్లీ లైన్‌కు అక్టోబర్ 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయ్యి అందుబాటులోకి రావడంతో ఇవాళ ప్రారంభించారు.

## రేవంత్ పాలనలో
# రోడ్డెక్కనిది ఎవరు?

మొదటి పేజీ తరువాయి...

పాలనకు ఒక్క నెల మిగిలింది. కనీసం 10 శాతం అంటే 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చావా..? నిరుద్యోగులను దగా చేశావు. నిరుద్యోగ భృతిపై అసెంబ్లీలో అడిగితే హామీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి మోసపు మాటలు మాట్లాడారు. విద్యార్థులకు భరోసా కార్డు ఇస్తా అన్నావు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఇప్పటి వరకు కూడా నయా పైసా ఇవ్వలేదు. దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కేసీఆర్ మానవీకోణంలో ఆలోచించి కొనసాగించారు. కకాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు. విద్యార్థుల బతుకులు ఆగం అవుతుంటే.. నీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులకు మూడు డీఏలు ఇస్తానని మాటిచ్చావు. పెండింగ్‌లో బిల్లులు క్లియర్ చేస్తా అన్నావు. పీఆర్సీ ప్రకటించి వేతనాలు పెంచుతానని ప్రకటించావు. ఇందులో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదు. పీఆర్సీ ఉలుకే లేదు. ఒక్క డీఏ ఇచ్చి దీపావళి పండుగ జరుపుకోండి అంటున్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ నిర్ణయించిన డీఏనే ఇప్పుడి స్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 15 డీఏలు ఇచ్చింది. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండే.. కనీసం మూడు అయినా ఇస్తావు అనుకుంటే.. ఒక్క డీఏతో సర్దిపెడుతున్నావు. పీఆర్సీ ఇవ్వక, ఓపీఎస్ అమలు చేయక, 317 జీవో పరిష్కరించకుండా ఉద్యోగులను మోసం చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేశారు. 6 వేల మంది టీచర్లు పదవీ విరమణ పొందారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌లో వారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మూడేండ్లకు నాలుగేండ్లకు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే అది కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వమే అని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి వికృతరూపాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో 11 నెలల రేవంత్ రెడ్డి పాలన చూస్తే ప్రజా పాలన కాదు ప్రజా పీడనగా కనబడుతుంది. ప్రజా పాలన తొలిగిపోయి కాంగ్రెస్ పార్టీ వికృతరూపం బట్టబయటలైంది. ఏ వర్గానికి తామిచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయింది. సీఎం వికృతరూపాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా చూసినా ధర్నాలతో అట్టుడికి పోతోందని అన్నారు. దర్నాలు చేస్తున్న వారిని చర్చలకు పిలవొచ్చు కదా..? ఎందుకు చర్చలు జరపడం లేదు. ఎందుకు తిరగబడుతున్నారు. నోటికొచ్చినట్టు మాట్లాడడం మాత్రమే ముఖ్యమంత్రికి తెలుసు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ఎందుకు దృష్టి పెట్టడం లేదు. హామీలు అమలు చేయమంటే నోటికొచ్చినట్టు తిడుతున్నవ్. ఇది సీఎం వైఖరి అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. ఒక్క పంటకు కూడా రైతు బంధు లేదు. పదిహేను వేలు కాదు కదా..? ఉన్న పదివేలు కూడా రావడం లేదు. చివరకు పంటలు కొనే దిక్కు లేదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు జరగడం లేదు. రూ. 7521కు క్వింటాల్ పత్తి కొంటామని మద్దతు ధర ప్రకటించారు. కానీ రైతులు రూ. 5500కు పత్తి అమ్ముకుంటున్న పరిస్థితి. మద్దతు ధర రాకపోతే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఉలుకుపలుకు లేదు. దిగాలుగా ఉన్న పత్తి రైతుకు.. అండగా నిలవడం లేదు. బోనస్ కాదు కదా.. మద్దతు ధర రావడం లేదు. వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మంలో రైతులు రో÷-డడెక్కితే నీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని అన్నారు. కొబ్బరికాయలు కొడుతున్నారు.. కానీ ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదు. చివరకు వరి ధాన్యాన్ని రూ. 1900కు అమ్ముకుంటున్నారు. రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. మక్క రైతులకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. సోయాబీన్ రైతులను పట్టించుకోవడం లేదు. రైతులను రోడ్డు మీదకు తీసుకొచ్చిన పరిస్థితి కాంగ్రెస్ పాలనలో దాపురించిందని హరీశ్‌రావు తెలిపారు.

## తెలంగాణలో భారీగా
# ఐఏఎస్‌లు, ఐఎఫ్ఎస్‌ల బదిలీ

మొదటి పేజీ తరువాయి...

చంద్రశేఖర్ రెడ్డి, క్రీడాశాఖ డైరెక్టర్‌గా సోని బాలాదేవీ, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఎండీగా కొర్రా లక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఎండీగా ఎన్. క్షితిజ, జీహెచ్ఎంసీ అర్బన్ ఫారెస్ట్రీ అదనపు కమిషనర్‌గా సుభద్రాదేవీ, వికారాబాద్ డీఎఫ్‌గా జి.జ్ఞానేశ్వర్‌లకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## మండాలపాడులో మాచినేని కృష్ణయ్యను పరామర్శించిన మంత్రి తుమ్మల

పెనుబల్లి-ప్రభాత సూర్యుడు పెనుబల్లి మండల పరిధిలో మండల పాడు గ్రామంలో మాచినేని కృష్ణయ్య ను వారి నివాసానికి వెళ్లి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని పరామర్శించిన వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరావు ఈ కార్యక్రమం లో మండల నాయకులు మరియు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా పసుమర్తి చంద్రావు



కల్లూరు - ప్రభాత సూర్యుడు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నియమావళి ప్రకారం 2024-26 వ సంవత్సరానికి గాను ఎన్నికల నోటిఫికేషన్ లో భాగంగా ఈరోజు నామినేషన్లు స్వీకరించడం జరిగింది. ఒక నామినేషన్ మాత్రమే రావటం వలన పసుమర్తి చంద్రావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు దోసపాటి వెంకటేశ్వరరావు, చారుగుళ్ళ శ్రీనివాసరావు ప్రకటించడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నియమావళి ప్రకారం ప్రతి రెండు సంవత్సరాలకు జిల్లా అధ్యక్షుడు ఎన్నికలు జరుగుతాయి. రొటేషన్ ప్రకారం ప్రస్తుతం ఖమ్మం రెవెన్యూ డివిజన్కు సంబంధించిన వనమా వేణుగోపాలరావు అధ్యక్షుడిగా ఉన్నారు. 2024-26 సంవత్సరానికి గాను కల్లూరు రెవెన్యూ డివిజన్ కు కేటాయించడం జరిగింది. కల్లూరు రెవెన్యూ డివిజన్ నుంచి పసుమర్తి చంద్రావు ఒక్కరు మాత్రమే నామినేషన్ వేయడం జరిగింది. పసుమర్తి చంద్రావు ఎన్నిక పట్ల ఖమ్మం జిల్లాలోని 21 మండలాల అధ్యక్షులు, మరియు వారి కార్యవర్గం, పలువురు ఆర్యవైశ్యులు అభినందనలు తెలియజేయడం జరిగింది. పసుమర్తి చంద్రావు కల్లూరు గ్రామపంచాయతీ సర్పంచ్ గాను, తెలుగుదేశం పార్టీలో జిల్లా నాయకుడిగాను, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో జిల్లా నాయకుడిగాను, వ్యవసాయ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరావు శిష్యుడిగాను ఉన్నారు. ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన పసుమర్తి చంద్రావును తుమ్మల నాగేశ్వరావు, మల్లు భట్టి విక్రమార్క శ్రీమతి నందిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# డిజిటల్ అరెస్ట్లు..పారాహుషార్!

డిజిటల్ అరెస్ట్..ఇప్పుడీ భయం ప్రపంచాన్ని వణికిస్తోంది. కరోనాను మించి భూతంలా వెన్నాడుతోంది. అనేకులు మోసపోతున్నారు. బెదరించి..బ్లాక్ మెయిల్ చేయడం ద్వారా ఖాతాలను కొల్లగొట్టేస్తున్నారు. ఇలాంటి ఫేక కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసం చేస్తున్నాడని గుర్తించి పోలీసులను అప్రమత్తం చేయాలి. ఓ రకంగగా ఇలాంటి కాల్స్ వస్తే తిరస్కరించడమే మేలు. డిజిటల్ అరెస్ట్ల క్రమంలో భారత్ అప్రమత్తం అయ్యింది. బాధితులు హేతుబద్ధంగా ఆలోచించే వ్యవధి ఇవ్వరాదనే సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు, తక్షణం స్పందించకపోతే చట్టపరమైన చర్యలు వంటి మాటలతో భయపెట్టాలని చూస్తున్నారు. దేశీయంగా ప్రభుత్వ ఏజెన్సీలు అధికారిక లావాదేవీలకు వాట్సప్ లేదా స్కైప్ వంటి వేదికలను ఉపయో గించవు. ఎవరైనా ఫోన్కాల్ లేదా ఈమెయిల్ ద్వారా సంప్రదించి.. మీ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై దర్యాప్తు చేస్తున్నామని చెబితే బెంబేలు పడిపోకుండా అవతలి వ్యక్తులతో మాట్లాడి వారి గుర్తింపును ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. మోసగాళ్లు మిమ్మల్ని మభ్యపెట్టి బ్యాంకు ఖాతాల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి తెస్తారు. ఇటువంటి సందర్భాల్లో మన భయం వారి పని సులువు చేస్తున్నదనే విషయాన్ని గుర్తించాలి. చట్టబద్ధమైన ఏజెన్సీలు ఏవీ తక్షణం డబ్బు పంపాలని ఒత్తిడి తీసుకురావు. సైబర్ నేరాలకు స్పందించే ముందు ఒక క్షణం ప్రశాంతంగా ఆలోచించాలి. తెలియని నంబర్లకు ఫోను ద్వారా, వీడియోకాల్స్ ద్వారా వ్యక్తిగత సమాచారం, ఆర్థికపరమైన వివరాలు ఇవ్వరాదు. పెరుగుతున్న సైబర్ నేరాల నుంచి రక్షించుకోవాలంటే మరింత జాగ్రత్తగా, ఎప్పటికప్పుడు ఇటువంటి పరిణామాలు తెలుసుకొంటూ ఉండటం అవసరం. ఒక్కోసారి చట్టబద్ధమైన సంస్థల లోగోలు కూడా మోసగాళ్లు వాడుతుంటారు. లాటరీ తగిలిందనే సందేశాలు వచ్చినపుడు గుడ్డిగా నమ్మడం, దురాశకు పోవడం చేస్తే సులువుగా దోచేస్తారు. వైద్య చికిత్సల కోసమని, ఫేక్ ఛారిటీ అప్పీళ్లతో భావోద్వేగాలను బలహీనతగా వాడుకునే కుంభకోణాలు, చట్టబద్ధమైన హైరింగ్ పోర్టల్స్ లేదా సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఉపాధి పోస్టులు పెట్టి



నిరుద్యోగులను మోసగించే వైనాలు కూడా ఉంటున్నాయి. వినియోగదారులకు సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం ఆసరాగా చేసుకొని వైరస్ గురించి హెచ్చరించడం ద్వారా రహస్యంగా కంప్యూటర్ను యాక్సెస్ చేసి సున్నితమైన వ్యక్తిగత సమాచారం అపహరిస్తారు. త్వరగా డబ్బు సంపాదించాలనే బలహీనతను ఆసరాగా చేసుకొని పెట్టుబడి కుంభకోణాలు, ఫేక్ ఆన్లైన్ స్టోర్లతో క్యాష్ ఆన్ డెలివరీ మోసాలు కూడా పెరుగుతున్నాయి. పొరపాటున మన ఖాతాకు పంపిన డబ్బు వెనక్కు ఇవ్వాలని కోరడం.. ఓటీపీలు అడగటం.. డ్రగ్స్ పార్శిళ్లు వచ్చాయనే బెదిరింపులు, తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వజూపటం వంటి ఎత్తుగడల్లో సైబర్ నేరగాళ్లు నైపుణ్యం సాధించారు. దేశంలో ఆన్లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో డజనుకు పైగా సూచనలతో ప్రజలను అప్రమత్తం చేస్తూ సీఈఆర్టీ-ఐఎన్' కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ఆఫ్ ఇండియా అత్యవసర పబ్లిక్ అడ్వయిజరీని జారీ చేసింది. భారత సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ విడుదల చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సైతం 'మన్ కీ బాత్'లో సైబర్ నేరాల గురించి ప్రజలను హెచ్చరించారు. అసలు 'డిజిటల్ అరెస్టు' అన్నదే పెద్ద ఆన్లైన్ కుంభకోణమని సీఈఆర్టీ-ఐఎన్ తెలిపింది. నిజానికి వారు ప్రదర్శించే ఒత్తిడి వ్యూహాలకు లొంగరాదని సీఈఆర్టీ-ఐఎన్ తన అడ్వయిజరీలో ప్రజలను కోరింది.'డిజిటల్ అరెస్టు'ల పేరిట ఆన్లైన్లో జరుగుతున్న మోసాలను ప్రధాని మోదీ ఏకంగా మన్కీబాత్లో ప్రస్తావించి.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడంతో అందరి దృష్టి వీటిపై పడింది. ఇటీవల వీటికి సంబంధించిన కీలక సమాచారాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దేశంలో చోటుచేసుకొంటున్న డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్, రొమాన్స్ స్కామ్లు, ఇన్వెస్ట్మెంట్ మోసాల్లో దాదాపు 46శాతం మూడు దేశాల నుంచే జరుగుతున్నట్లు గుర్తించారు. వాటిల్లో పొరుగున్న మయన్మార్, లావోస్, కంబోడియా కేంద్రంగా ఈ ముఠాలు రెచ్చిపోతున్నాయని వెల్లడించింది. ఇప్పటివరకు మొత్తంగా బాధితులు దాదాపు రూ.1,776 కోట్లు నష్టపోయారని గణాంకాలు చెబుతున్నాయి. ఇలాంటిమోసపూరిత కాల్స్..బెదిరింపులపై ఎప్పటికప్పుడు అప్రమత్తం కావాలి. ప్రజలు ఒక్క క్షణం ఆలోచించి అడుగువేస్తే డిజిటల్ అరెస్టుల మోసం నుంచి రక్షణ పొందవచ్చు. నిజానికి డిజిటల్ మోసాలపై ఆందోళన చెందవద్దు. అప్రమత్తతతో ఉంటే చాలని గుర్తించాలి. నిజానికి మోసగాళ్లు ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరించి, ఆ తర్వాత భయపెడతారు. మనకే ఆశ్చర్యం కలిగించేలా మీ సమాచారాన్ని సేకరిస్తారు. ఆ తర్వాత తమ ఆహార్యంతో ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నామనే భ్రమ కల్పిస్తారు.వారెంతగా మిమ్మల్ని భయపెడతారంటే.. మనకుకు ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వరు. ఇప్పటికిప్పుడు తాము చెప్పినట్లు చేయకపోతే అరెస్టు తప్పదని మానసిక ఒత్తిడి తెస్తారు. దీంతో కొందరు భయంతో కష్టార్జితం మొత్తాన్ని వారికి కట్టబెడుతున్నారు. అందుకే అప్రమత్తంగగా ఉండాలి. ఒకవేళ నేరగాళ్ల నుంచి ఫోన్కాల్స్ వస్తే బెదిరిపోవద్దు. వీలైతే స్క్రీన్షాట్ తీసి, కాల్ను రికార్డు చేయాలి. డిజిటల్ అరెస్టు అనేది మన చట్టాల్లో లేదు. అది ముమ్మాటికీ మోసం, వంచన, అబద్ధం. ఇలాంటి పనులు చేస్తున్నవారు సమాజానికి శత్రువులు అనే గుర్తించాలి. కాల్ చేసిన వారి గురించి అస్సుల పట్టించుకోవద్దు. ఎలాంటి బెదిరింపులు, ప్రలోభాలకు లొంగగవద్ద. సాధ్యమైనంత వరకు కాల్స్ కట్ చేయాలి. బెదరింపులకు పాల్పడే వారిని గుర్తించి ఫిర్యాదు చేయాలి. అంతేగాకుండా మన తోటివారితో చర్చించాలి.

# దేశవ్యాప్తంగా దీపావళి పండగ శోభ

## స్వల్పంగా తగ్గిన బంగారం, వెండి ధరలు.. ధన త్రయోదశికి ఆఫర్లు ప్రకటించి వ్యాపారులు

దేశవ్యాప్తంగా దీపావళి పండగ శోభ వచ్చేసింది. దీపావళి పండుగ సందర్భంగా లక్ష్మి దేవిని ఆడ పడుచులు పూజిస్తారు. తమకు సిరి, సంపదలు కలుగజేయాలని కోరతారు. అన్నింటికి మంచి ధన త్రయోదశి రోజు బంగారం కొనాలన్న కోరిక ఉంది. ధన త్రయోదశికి వ్యాపారులు ఆఫర్లు ప్రకటించారు. పండగ సమయంలో బంగారం, వెండి కొనడం కామన్. పసిడి ప్రియులకు బంగారం లాంటి వార్త. బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. తెలుగు రాష్ట్రాల్లోనే.దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం వెండి ధరలు ఎలా కొంచెం తగ్గాయి. అయితే పెరిగినప్పుడు వేలల్లో పెరగడం, తగ్గినప్పుడు మా÷-తరం వందల్లో తగ్గడం మార్కెట్ పరిస్థితికి అద్దం పడుతోంది. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం, ద్రవ్యోల్బణం, రూపాయితో డాలర్ మారకం విలువ ఆధారంగా బంగారం ధరలో మార్పు జరుగుతుంటుంది. హైదరాబాద్లో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.73, 590గా ఉంది. విజయవాడ, విశాఖపట్టణం లో కూడా ఇదేవిధంగా ఉంది. 22 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ.80,280గా ఉంది. విజయవాడ విశాఖపట్టణంలో కూడా ఇదేవిధంగా ఉంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.73,590గా ఉంది. కోల్ కతాలో రూ.73,590గా ఉంది. ఢిల్లీలో రూ.73,740గా ఉంది. చెన్నైలో రూ.73,590గా ఉంది. ముంబై, కోల్ కతా, చెన్నైలో మేలిమి బంగారం ధర రూ.80,280గా ఉంది. ఢిల్లీలో కాస్త ఎక్కువగా ఉంది. రూ.80,430గా ఉంది. వెండి ధర కూడా పెరిగింది. కిలో వెండిపై రూ.100 పెరిగింది. హైదరాబాద్లో కిలో వెండి ధర రూ.1,06,900గా ఉంది. చెన్నై, కేరళ, విజయవాడ, విశాఖపట్టణంలో ఇలానే ఉంది. ముంబై, ఢిల్లీ, కోల్ కతా, పుణెళిలో కిలో వెండి ధర రూ.97,900గా ఉంది. బెంగళూరులో కిలో వెండి ధర రూ. 96 వేల 900గా ఉంది. ఇకపోతే ధన త్రయోదశి 2024 వచ్చేసింది. హిందువులకు





ముఖ్యమైన పర్వదినాల్లో ఒకటైన ఈ పండగ అక్టోబర్ 29న మంగళవారం జరగనుంది. పవిత్రమైన ఈ రోజున బంగారాన్ని కొనుగోలు చేస్తే ఏడాదంతా శుభం జరుగుతుందని, ఆరోగ్యం, సిరిసంపదలు నిండుతాయని హిందువులు విశ్వసిస్తుంటారు. ప్రత్యేకమైన ఈ రోజున ధన్వంతరీ, లక్ష్మి దేవి, వినాయకుడు, కుబేర దేవతలను పూజిస్తుంటారు. బంగారం, వెండి, రాగి వంటి విలువైన లోహాలు కొనుగోలు చేసి దేవుళ్లను పూజిస్తారు. ముఖ్యంగా బంగారం, వెండి లక్ష్మీదేవికి బాగా ప్రీతికరమైనవి కావడంతో వీటిని కొనుగోలు చేస్తారు. అయితే ధన త్రయోదశి సందర్భంగా బంగారం కొనే విషయంలో కస్టమర్లు అజాగ్రత్తగా ఉండకూడదు. బంగారం స్వచ్ఛతను క్షుణ్ణంగా తనిఖీ చేసుకున్నాకే కొనుగోలు చేయాలి. కొంతమంది వ్యాపారులు తక్కువ స్వచ్ఛత కలిగిన బంగారాన్ని విక్రయించడానికి ప్రయత్నించే అవకాశాలు ఉంటాయి. కాబట్టి ఎలాంటి మోసాలకు తావివ్వకుండా మీకు మీరే స్వచ్ఛతను పరిశీలించు

కోవడం చాలా ఉత్తమం. అందుకు సులభమైన ఐదు మార్గాలు ఉ న్నాయి. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (ఃఎ÷ూ) హాల్మార్క్ బంగారం నాణ్యత పరిశీలనలో అత్యంత విశ్వసనీయమైనది. బంగారం స్వచ్ఛతను ఈ మార్క్ నిర్ధారిస్తుంది. హాల్మార్క్లో క్యారెట్లలో స్వచ్ఛత, స్వర్ణకారుడి గుర్తింపు వంటి సమాచారం ఉ ఒటుంది.

హాల్మార్క్ ఉన్న బంగారు ఆభరణాల ప్రతి ముక్కకు ఒక ప్రత్యేకమైన హాల్మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ ఉంటుంది. గోల్డ్ ప్రామాణికతను నిర్ధారించడంలో ఈ నంబర్ సహాయపడుతుంది. బిస్ కేర్ యాప్ని ఉపయోగించి ఈ నంబర్ను ధ్రువీకరించుకోవచ్చు. ఆభరణాల స్వచ్ఛత, రిజిస్ట్రేషన్, హాల్మార్కింగ్ సెంటర్ వంటి సమాచారాన్ని మీరే స్వయంగా తెలుసుకోవచ్చు. బంగారం కొనాలనుకునే వారు యాప్ స్టోర్లో బీఐఎస్ కేర్ యాప్ని డౌన్లోడ్ చేసుకోవాలి. ఈ సాఫ్ట్వేర్ ద్వారా హెచ్యూఐడీని గుర్తించవచ్చు. తద్వారా మీరు కొంటున్న బంగారం నిజమైనదా కాదా అని మీరే నిర్ధారించుకోవచ్చు. ఇందులో స్వర్ణకారుడి వివరాలతో పాటు హాల్మార్కింగ్ సెంటర్కు సంబంధించిన సమాచారం కూడా ఉంటుంది. బంగారు ఆభరణాలు వివిధ రకాల స్వచ్ఛత స్థాయిలలో ఉంటాయి. నాణ్యతను తరచుగా క్యారెట్లలో కొలుస్తారు. సాధారణంగా ధన త్రయోదశి సమయంలో 22 క్యారట్ల బంగారాన్ని ఎక్కువగా కొంటుంటారు. అయితే 24 క్యారెట్ల బంగారం ఎక్కువ నాణ్యత కలిగివుంటుంది. బంగారం నాణ్యతను అక్కడికక్కడే వేగంగా గుర్తించేందుకు అయస్కాంతాన్ని ఉ పయోగించవచ్చు. నిజమైన బంగారం అయస్కాంతానికి అతుక్కోదు. ఒకవేళ అతుక్కున్నా అటు ఇటు కదలాడినా అది స్వచ్ఛమైనది కాదని అనుమానించవచ్చు. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే బంగారు బరువు, క్యారెట్, హాల్మార్క్ ధృవీకరణతో కూడిన పూర్తి బిల్లును నగల వ్యాపారి నుంచి తీసుకోవాలి. భవిష్యత్తులో అమ్మకాలు లేదా విక్రయాల విషయంలో ఈ బిల్లు ఉపయోగపడుతుంది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# 400కు పైగా విమానాలకు బాంబు బెదిరింపులు

## అప్రమత్తమైన జాతీయ దర్యాప్తు సంస్థ

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (ప్రభాత సూర్యుడు):** దేశంలో ఇటీవలే వరుస బాంబు బెదిరింపు ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా విమానాలకు ఇలాంటి బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. రెండు వారాల వ్యవధిలోనే ఏకంగా 400కుపైగా విమానాలకు ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. ఈ నేపథ్యంలో జాతీయ దర్యాప్తు సంస్థ అప్రమత్తమైంది. దేశ వ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల్లో భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. ఇలాంటి ఘటనలను పరిష్కరించడానికి ఎన్ఐఏ సైబర్ విభాగం బెదిరింపు కాల్స్‌పై సమగ్ర విశ్లేషణ ప్రారంభించింది. బెదిరింపు కాల్స్‌కు వెనుక ఉన్న ఉద్దేశాలను తెలుసుకునే పనిలో పడింది. ఇతర భద్రతా సంస్థలతో కలిసి బెదిరింపు కాల్స్‌పై విచారణ చేపడుతోంది. ప్రధాన విమానాశ్రయాల్లో బాంబ్ థ్రెట్ అసెస్‌మెంట్ కమిటీ బృందాన్ని మోహరించింది. బెదిరింపులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రతిస్పందించేలా ఈ బృందం శిక్షణ ఇస్తుంది. అంతేకాదు విమానాశ్రయాల్లో భద్రతా మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరుస్తుంది. గత కొన్ని రోజులుగా ఇండిగో, ఎయిర్ ఇండియా సహా వందలాది విమానాలకు బెదిరింపులు వస్తున్న విషయం తెలిసిందే. రోజులో కనీసం వంద విమానాలకు ఇలాంటి బెదిరింపు కాల్స్, మెయిల్స్ రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈ కారణంగా విమానాలు ఆలస్యం కావడానికి తోడు.. ప్రయాణికుల్లో తీవ్ర భయాలు నెలకొంటున్నాయి. అదే సమయంలో విమానయాన సంస్థలు భారీగా నష్టపోవాల్సిన పరిస్థితి.

# నా గురువు, నా మెంటార్, నా స్ఫూర్తిదాత



### అమితాబ్ బచ్చన్‌పై చిరంజీవి పొగడ్తలు
### చిరంజీవికి అక్కినేని పురస్కారం అందచేత
### అమితాబ్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం


నా గురువు, నా మెంటార్, నా స్ఫూర్తిదాత అమితాబ్ బచ్చన్ అంటూ..ఆయనకు అగ్ర నటుడు మెగాస్టార్ చిరంజీవి ధన్యవాదాలు తెలిపారు. నాకు ఎప్పుడు ఏ మంచి జరిగినా, నాకు ఎప్పుడైనా అవార్డు వచ్చినా ఆయన నుంచే తొలుతగా నాకు శుభాకాంక్షలు వస్తాయని గుర్తుచేసుకున్నారు. కొన్నిసార్లు ఇలా వచ్చి ఆశీర్వదిస్తుంటారు. ఆయన లాంటి బిగ్ స్టార్ నాకు ఈ అవార్డు ప్రదానం చేయడం ఆనందదాయకం అని ప్రముఖ కథానాయకుడు చిరంజీవి అన్నారు. ఏఎన్నార్ జాతీయ పురస్కారాన్ని ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ చేతుల మీదుగా అందుకున్న తర్వాత చిరంజీవి మాట్లాడారు. అన్నపూర్ణ స్టూడియలో అట్టహాసంగా అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈ క్రమంలో ఏఎన్నార్, అమితాబ్‌తో తన అనుబంధం గురించి చెప్పుకొచ్చారు. పద్మ భూషణ్ అవార్డు వచ్చినప్పుడు నన్ను సినిమా పరిశ్రమ సన్మానించింది. ఆ సమయంలో అమితాబ్ నా గురించి 'చిరంజీవి కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా' అని చెప్పారు. ఆ మాటలు విన్నాక నాలో చిన్న వణుకు కనిపించింది. నా నోట మాట రాలేదు. నా మనసు అమితానందంతో నిండిదిపోయింది. ఆ రోజు ఆయనకు ధన్యవాదాలు సరిగా చెప్పానో లేదో గుర్తులేదు. అప్పుడు నా పరిస్థితి అలాంటిది. ఇండియన్ సినిమాకి బాద్‌షా, షెహన్ షా, చక్రవర్తి అయిన అమితాబ్ బచ్చన్ నోటి నుంచి ఆ మాటలు రావడం అంటే ఎంత పెద్ద విషయమో కదా. ఆయన మాటలు నన్ను ఎంతో ప్రోత్సాహం ఇచ్చాయి. ఆయన మాటలు నాకు ఎంతో విలువైనవని చిరంజీవి చెప్పారు. నేను 1990లో హిందీలో తొలి సినిమా (ప్రతిబంధ్) చేసినప్పుడు అమితాబ్‌కు చూపించాను. ఆయన సినిమా చూస్తున్నంతసేపూ చాలా ఆందోళనగా ఉన్నాను. ఆయనకు నచ్చుతుందో లేదో అని అనుకుంటూ ఉన్నా. సినిమా అయ్యాక ఆయన వచ్చి 'శక్తివంతమైన నటన నీది, సమాజానికి అవసరమైన సినిమా ఇది' అని మెచ్చుకున్నారు. ఆ మాటలు నాకు ఎంతో శక్తినిచ్చాయి. ఆ సమయంలో నేను పిల్లాడిని అయిపోయి ఆయన మాటలకు సంతోషించాను. నా కెరీర్ ప్రారంభం నుంచి ఆయన నన్ను ప్రోత్సహిస్తున్నారు. ఆయన 70వ జన్మదినం సందర్భంగా ఆయన ఇంటికి వెళ్లినప్పుడు, మా ఇంట్లో శుభకార్యాలకు వచ్చినప్పుడు ఆయన నాపై ఎంతో ప్రేమ చూపిస్తారని తెలిపారు. 'సైరా'లో నా గురువు పాత్ర కోసం అమితాబ్ బచ్చన్‌ను ఎలా సంప్రదించాలా? అని సినిమా టీమ్ ఆలోచిస్తుండగా.. నేను ఆయనకు ఓ మెసేజ్ చేశాను. ఆయన నుంచి రిప్లయ్ రాకపోతే అక్కడితో ఆ ప్రయత్నం ఆపేద్దాం అనుకున్నాను. కానీ ఆయన వెంటనే రెస్పాండ్ అయ్యారు. దాంతో నేను సినిమాలో పాత్ర కోసం చెప్పాను. సినిమాలో మీరు నాకు గురువుగా నటించాలి అని కోరాను. దానికి ఆయన 'నేను చేస్తాను' అని చెప్పారు. మీ కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయాలి అని అడిగాను. దానికి ఆయన 'నా గురించి ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయనక్కర్లేదు. నేను నా గురించి చూసుకుంటాను' అని చెప్పారు. అదీ ఆయన గొప్పతనం. సినిమా ఆఖరి రోజు 'ఫార్మాలిటీస్' (పారితోషికం) గురించి మొహమాటపడుతూ అడిగాను. దానికి ఆయన 'ఫార్మాలిటీస్ ఏమీ అక్కర్లేదు. నువ్వు నా స్నేహితుడివి. నీ మీద ప్రేమాభిమానాలతో ఈ సినిమా చేస్తున్నాను. నన్ను ఇన్‌సల్ట్ చేయొద్దు' అని అన్నారు. అది ఆయన నా మీద చూపించే అభిమానం అని 'సైరా' రోజుల్ని గుర్తు చేసుకున్నారు చిరంజీవి. అమితాబ్ నుంచి నేను చాలా విషయాలు నేర్చుకున్నాను. అందరి ముందు నా మనసు లోతుల్లోంచి చెబుతున్న మాటలు ఇవి. నేను మీకు ఏమి తిరిగి ఇవ్వగలను. మీకు ధన్యవాదాలు చెప్పడం తప్ప. మీకు ఆ దేవుడు దీర్ఘాయుష్షు, ఆరోగ్యం ఇవ్వాలని కోరుకుంటున్నాను అని చెప్పారు.

'తెలుగులో ఇంట గెలిచి రచ్చ గెలవాలి అని ఓ నానుడి ఉంది. నా విషయంలో రచ్చ గెలిచి ఇప్పుడు ఇంట గెలిచాను ఏమో అనిపిస్తోంది. నటుడిగా నేను ఎదుగుతున్న సమయంలో బయట ప్రేక్షకులు, సన్నిహితుల నుంచి ప్రశంసలు వచ్చేవి. అయితే ఇంటికి వెళ్లినప్పుడు మా నాన్న సినిమాలు చూసి పొగుడుతారేమో అని అనుకునేవాణ్ని. మా నాన్నకు నటన అంటే చాలా ఇష్టం. అలాంటి మా నాన్న నన్ను ఎందుకు పొగడరు అనిపించేది. ఓ రోజు ఇంటికి వెళ్లినప్పుడు నా కవర్ పేజీలతో కొన్ని పుస్తకాలు చూస్తున్నారు. నేను వెళ్లేసరికి తీసి పక్కన పడేశారు. 'ఫొటోలు బాగున్నాయిరా' అని ఓ మాట అంటారేమో అని అనుకున్నాను. కానీ ఆయన అలా అనలేదు. లోపలకు అమ్మ దగ్గరకు వెళ్లి.. 'ఏంటమ్మా నాన్న ఎప్పుడూ నా గురించి ఓ మాట అనరు, బాగుందని కూడా చెప్పరు' అని అడిగాను. బయట రచ్చ ఎంత గెలిచినా సరే.. ఇంట గెలవడం లేదు అనిపిస్తోంది అని అన్నాను. దానికి అమ్మ 'లేదురా నాన్న చాలా పొగుడుతారు. ఏం చేశాడు నా కొడుకు, అదరగొట్టేశాడు' అని అంటుంటారు అని చెప్పింది. మరి నా దగ్గర ఆ మాటలు అనొచ్చు కదా అని అమ్మను అంటే 'బిడ్డల్ని తల్లిదండ్రుల్ని పొగడకూడదు. అది వారికి ఆయుక్షీణం అని అమ్మ చెప్పింది అని చిరు తెలిపారు. సినిమా పరిశ్రమలో నేను తొలుత రచ్చ గెలిచాను. నా ఇల్లు అనుకునే పరిశ్రమలో నాకు ఆ అవకాశం టాలీవుడ్ వజ్రోత్సవాల సమయంలో వచ్చింది. లెజండరీ పురస్కారం ప్రదానం చేయబోయారు. ఆ సమయంలో చాలా ఆనందమేసి ధన్యుణ్ని అనుకున్నా. కానీ ఆ రోజు కొన్ని ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో కొందరు హర్షించని ఆ సమయంలో ఆ పురస్కారాన్ని తీసుకోవడం సముచితం అనిపించలేదు. అందుకే ఆ రోజు ఆ అవార్డుని ఓ క్యాప్సుల్ బాక్స్‌లో పడేసి.. నాకు అర్హత ఎప్పుడు వస్తుందో అప్పుడు తీసుకుంటాను అని చెప్పాను. అంటే ఆ రోజు నేను ఇంట గెలవలేదు. ఈ రోజు ఏఎన్నార్ అవార్డును అందుకున్న రోజున ఇప్పుడు అనిపిస్తోంది.. 'నేను ఇంట గెలిచాను.. రచ్చ గెలిచాను' అని. అందుకే ఈ పురస్కారం గురించి చెప్పడానికి నాగార్జున, వెంకట్ ఇంటికి వచ్చినప్పుడు నేను చాలా ఆనందించాను. నాకు పద్మభూషణ్, పద్మ విభూషణ్, గిన్నిస్ బుక్‌లో స్థానం.. ఇలాంటివి ఎన్ని వచ్చినా ఈ అవార్డు విషయంలో నా భావోద్వేగం వేరుగా ఉంది. నా వాళ్లు నన్ను గుర్తించి నాకు అవార్డు ఇస్తుండటం నాకు గొప్ప విషయంగా అనిపించింది. అందుకే నాగార్జునతో ఇది నాకు అన్ని పురస్కారాలకు మించిన అవార్డు అని చెప్పా. ఇదే మాట స్టేజీ మీద చెప్పాలి అనుకున్నాను. ఇప్పుడు చెప్పాను అని చిరంజీవి తన ఆనందాన్ని తెలియజేశారు. అమ్మను ఇలా ఫ్రంట్ సీట్‌లో కూర్చోబెట్టడానికి ఓ కారణం ఉంది. ఏఎన్నార్ గారి అభిమానుల్లో సీనియర్ మోస్ట్ ఫ్యాన్ ఎవరన్నా ఉన్నారు అంటే అది అమ్మే. ఎలాంటి ఫ్యాన్ అనేది తెలియాలంటే.. కొన్నేళ్ల క్రితం జరిగిన సంఘటన గురించి చెప్పాలి. అమ్మ మొగల్తూరులో గర్భిణిగా ఉంది. నెలలు నిండి ప్రసవానికి సిద్ధమవుతోంది. ఆమె కడుపులో ఉన్న జీవి.. ఈ చిరంజీవి. ఆ సమయంలో నాన్నను అమ్మ ఓ కోరిక కోరింది. 'నాగేశ్వరరావు సినిమా 'రోజులు మారాయి' రిలీజైంది. నేను వెళ్లి చూడాలి. మళ్లీ తర్వాత అంటే కుదరదు. ప్రసవం అయితే బయటకు పంపరు' అని అంది. బస్సు వసతులు సరిగ్గా లేకపోవడంతో జట్కా బండి ఏర్పాటు చేశారు నాన్న. బండిలో వెళ్తుండగా.. బస్సుకు దారిచ్చే క్రమంలో తిరగబడింది. మొత్తంగా పొలంలో బండి సహా అమ్మ, నాన్న తిరగబడ్డారు. దీంతో తిరిగి ఇంటికి వెళ్లిపోదాం' అని నాన్న అంటే.. 'లేదు లేదు నేను సినిమాకు వెళ్లాల్సిందే' అని పంతం పట్టి సినిమా చూసింది. అంత పిచ్చి అమ్మకు సినిమాలంటే.. అందులోనూ నాగేశ్వరరావు సినిమాలు అంటే మరీ అభిమానం అని చిరు చెప్పారు. నాగేశ్వరరావు అంటే అమ్మకు ఉన్న అభిమానం.. రక్తం ద్వారా నాకు వచ్చిందేమో అనిపిస్తుంటుంది. ఆయన డ్యాన్సలు అంటే నాకు చాలా ఇష్టం. ఆయన సినిమాల్లో పాటలు వస్తే చూస్తూ, అనుకరిస్తూ డ్యాన్సలు వేసేవాణ్ని. అలాంటి ఏఎన్నార్‌గారు నా గురించి గొప్పగా మాట్లాడారు. 'నాకు ఎముకలు ఉన్నాయి, కానీ చిరంజీవికి ఎముకలు లేవని ఓసారి అన్నారు. మరో సందర్భంలో 'నేను డ్యాన్సులు వేయడానికి ఆద్యుణ్ని. ఆ డ్యాన్సలకు స్పీడ్, గ్రేస్ పెంచింది చిరంజీవే. హీరోయిన్లతో చిరు డ్యాన్స్ వేస్తుంటే నేను ఆయన్నే చూస్తాను' అని ఏఎన్నార్ చెప్పారు. అంతలా నన్ను ఆయన అభిమానించేవారు' అని ఏఎన్నార్‌ని చిరంజీవి గుర్తు చేసుకున్నారు. మేం చెన్నై నుంచి షూటింగ్‌కి వచ్చినప్పుడు అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఆయన ప్రత్యేకంగా వచ్చి కలిసేవారు. మీ లాంటి యువ నటులు మద్రాసు నుంచి ఇక్కడకు వచ్చేయాలి. అప్పుడే పరిశ్రమ నిజంగా ఆంధ్రప్రదేశ్ బదిలీ అయింది అనిపిస్తుంది అని ప్రోత్సహిస్తుండేవారు. అప్పుడు ఆయన చేసిన కృషి ఫలితాన్నే ఇప్పుడు మనం అనుభవిస్తున్నాం. 'కాలేజీ బుల్లోడు' వంద రోజుల ఫంక్షన్‌కు నన్ను పిలిచారు. ఆయన వెనుక సీట్‌లో నేను కూర్చుని ఉన్నా. ప్రేక్షకులు పెద్ద ఎత్తున కేరింతలు కొడుతున్నారు. చాలాసేపు అయినా ఆ ఉత్సాహం ఆగలేదు. దాంతో ఆయన నావైపు తిరిగి 'ఆ కేరింతలు నీ కోసమే.. లేవు పైకి ప్రేక్షకుల్ని పలకరించు' అని అన్నారు. 'వద్దలెండి సర్' అని నేనంటే.. 'ఏంటయ్యా మొహమాటం పడతావ్.. మీరు ముందుండాలి.. రా ముందుకు రా' అని నాతో అభివాదం చేయించారు. మామూలుగా అయితే అలాంటి సమయంలో సీనియర్ నటులు ఎవరైనా ప్రశంసల్ని ఇంకొకరికి షేర్ చేయడం కాస్త సంశయిస్తారు. కానీ ఆయన నన్ను ప్రోత్సహించారు. అదీ ఆయన గొప్ప మనసు' అని చిరంజీవి ఏఎన్నార్‌తో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'మెకానిక్ అల్లుడు'లో కలసి నటించినప్పుడు ఆయన నుంచి ఎన్నో మంచి విషయాలు, ఎలా నడుచుకోవాలి అనే విషయాలను నేర్చుకున్నా. ఆ సినిమాకు నాకో గొప్ప అనుభూతి. ఆ సమయంలో ఆయన్ను చూస్తే నడిచి వచ్చే ఎన్‌సైక్లోపీడియా అని అనిపించేది. ఆయనతో మాట్లాడినప్పుడు ఎంతో సరదాగా కలిసిపోయేవారు. విదేశాలకు షూటింగ్‌లకు వెళ్లినప్పుడు ఆయన కోసం చిన్నపాటి గిఫ్ట్‌లు తెచ్చేవాణ్ని. నేను రాజకీయాల్లోకి వెళ్లిన తర్వాత కూడా ఆయనతో మాట్లాడేవాణ్ని. పరిశ్రమల గురించి, రాజకీయ పరిస్థితుల గురించి ఆయనతో చర్చించేవాడిని.

### ఎఎన్నార్‌తో సరితూగడం

# ఎవరికైన కష్టమే

### అక్కినేని అవార్డు ప్రదానోత్సవంలో అమితాబ్



భారతీయ సినిమాకు సేవల విషయంలో ఏఎన్నార్‌తో సరితూగడం ఎవరికైనా కష్టమే అని అమితాబ్ బచ్చన్ అన్నారు. అన్నపూర్ణ స్టూడియోలో సోమవారం నిర్వహించిన 'ఏఎన్నార్ జాతీయ అవార్డు' వేడుకకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2024గానూ చిరంజీవికి ఆయన పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం అక్కినేని కుటుంబం, చిరంజీవిని కొనియాడారు. 'తెలుగు సినిమానే కాకుండా మొత్తం సినీ ఇండస్ట్రీలో ఏఎన్నార్ సత్తా చాటారు. తన నటనతో ఎంతోమందికి వినోదం పంచారు. ఏఎన్నార్ వారసత్వాన్ని కొనసాగిస్తున్నందుకు నాగార్జున, ఆయన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు అని పేర్కొన్నారు. నా కుమారులు.. నా కుమారులైనంత మాత్రాన నా వారసులు కాలేరు. ఎవరైతే నా వారసులవుతారో.. వారే నా కుమారులవుతారు అంటూ తన తండ్రి హరివంశ్‌రాయ్ బచ్చన్ రాసిన ఓ కవితను ప్రస్తావిస్తూ.. ఏఎన్నార్ విషయంలో నాగార్జున, ఆయన కుటుంబం దీన్ని నిరూపించిందన్నారు. ఎప్పుడు ఫోన్ చేసినా, ఏం అడిగినా.. నా ప్రియమైన మిత్రులు చిరంజీవి అందుబాటులో ఉంటారు. స్నేహం, ప్రేమ, ఆతిథ్యం విషయంలో ఆయనకు ధన్యవాదాలు. ఈ రోజు మీరు పంపిన భోజనం హోటల్‌లో ఉండేవారందరికీ సరిపోతుంది అని సరదాగా వ్యాఖ్యానించారు. చిరంజీవి, నాగార్జున, నాగ్ అశ్విన్ తదితరులు తమ సినిమాల్లో నన్ను భాగం చేశారు. తెలుగు చలన చిత్ర రంగంలో నేనూ సభ్యుడినే అని గర్వంగా చెప్పుకోగలను. ఇప్పటి నుంచి నన్నూ తెలుగు చలన చిత్ర పరిశ్రమలో భాగంగా పరిగణించండి. వచ్చే సినిమాలోనూ నాకు అవకాశం ఇవ్వడాన్ని మరవొద్దు. అవార్డు అందజేత విషయంలో నాకు ఈ గౌరవం కల్పించిన అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్, నాగార్జున, ఆయన కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు అని పేర్కొన్నారు.

## చిరంజీవి డ్యాన్స్‌లో గ్రేస్ చూసి టెన్షన్ పడ్డా

### తొలినాటి అనుభవాలను పంచుకున్న నాగార్జున



చిరంజీవి డ్యాన్స్‌లో గ్రేస్ చూసి కాస్త టెన్షన్ పడ్డానని నాగార్జున అన్నారు. అన్నపూర్ణ స్టూడియోలో సోమవారం నిర్వహించిన.. ఏఎన్నార్ జాతీయ అవార్డు ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. 2024గానూ ఆ పురస్కారం చిరంజీవికి దక్కింది. బాలీవుడ్ ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ..చిరంజీవి హిట్లు, సూపర్‌హిట్లు, రికార్డుల గురించి అందరికీ తెలుసు. ఇటీవల గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కూడా సాధించారు. ఆయనతో నాకు మంచి జ్ఞాపకాలున్నాయి. నేను సినిమాల్లోకి రావాలనుకునే సమయంలో.. అన్నపూర్ణ స్టూడియోస్‌లో చిరంజీవి ఓ పాట చిత్రీకరణలో పాల్గొన్నారు. నాన్న నన్ను పిలిచి.. 'చిరంజీవి అక్కడ డ్యాన్స్ చేస్తున్నారు. సినిమాల్లోకి వద్దామనుకుంటున్నావ్ కదా వెళ్లి చూడు. నేర్చుకోవచ్చు' అని చెప్పారు. నాన్న చెప్పినట్టుగా షూటింగ్ చూసేందుకు వెళ్లా.. అది రెయిన్ సాంగ్. వైట్ అండ్ వైట్ డ్రెస్సులో రాధతో కలిసి చిరంజీవి డ్యాన్స్ చేస్తున్నారు. ఆయన డ్యాన్స్‌లో ఉన్న గ్రేస్ చూసి కొంచెం భయం పట్టుకుంది. ఈయనలాగా మనం డ్యాన్స్ చేయగలుతామా అని అనిపించింది. సినిమా కాకుండా మరో దారి వెతుక్కుందాం అనుకుంటూ బయటకు వచ్చేశా అని నాటి సంగతులు గుర్తుచేసుకున్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వ్యక్తిత్వం చిరంజీవిది. ఇదే స్టూడియోలో కొన్నాళ్ల క్రితం అమితాబ్ బచ్చన్‌కు ఈ అవార్డు ఇచ్చాం. ఆ సమయంలో.. వేదికపై కొంతమంది అతిథులే ఉండేలా ప్రొటోకాల్ పెట్టాం. ఈవెంట్‌కు రమ్మని అడగ్గానే చిరంజీవి వస్తానన్నారు. కొన్ని పరిమితుల వల్ల వేదికపైకి ఆహ్వానించలేమని చెప్పా. 'అందులో అభ్యంతరం ఏముంది? నేను వస్తా. ముందు కూర్చొని వేడుక చూస్తా' అని అన్నారు. అమితాబ్‌కు శాలువాతో సత్కరించొచ్చా అని అనుమతి కోరారని పేర్కొన్నారు.

### దీపావళికి ముందే

# గాలిలో తగ్గిన నాణ్యత

### వ్యర్థాల దహనాలతో పెరిగిన కాలుష్యం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (ప్రభాత సూర్యుడు):** దేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. దీపావళి పండుగకు ముందే వాయు నాణ్యత దారుణంగా పడిపోయింది. పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను తగులబెడుతుండడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగింది. దీనికి తోడు పొగమంచు కూడా రాజధాని ప్రాంతాన్ని ఆవహించింది. దీంతో నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అధ్వానస్థితికి చేరినట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. సోమవారం ఉదయం ఢిల్లీలో ఏక్యూఐ 328 వద్ద నమోదైనట్లు కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ముఖ్యంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ సోమవారం ఉదయం 7 గంటల సమయంలో ఏక్యూఐ 357 గా నమోదైనట్లు పేర్కొంది. ఇక అక్షర్‌ధామ ఆలయం వద్ద 357గా గాలి నాణ్యత నమోదైనట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది. నగరంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు వెల్లడించింది. గాలి నాణ్యత క్షీణించడంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. ఇక 200-300 మధ్య ఉంటే గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని, 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana.
Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505,
Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215